క్లుప్తంగా

ఘనంగా గౌరీ పరమేశ్వరుల నిమజ్జనోత్సవం



గౌరీ పరమేశ్వరులను ఊరేగిస్తూ సారె తీసుకెళుతున్న భక్తులు

కోటవురట్ల: జల్లూరులో గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా ఆఖరి రోజు శనివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా సారెతో ఊరేగింపు చేసి సమీపంలోని కోనేటిలో నిమజ్జనం చేశారు. ప్రసాద వితరణ చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిమజ్జనోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాదెకు మద్దతుగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడికి మద్దతుగా పీఆర్టీయూ నేతలు, సభ్యులు శనివారం పలు పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవంతో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శ్రీనివాసులు నాయుడు కృషి చేస్తారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి. రమణ, ప్రగడ శివాజీ, ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్. ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మోదకొండమ్మ గుడి నిర్మాణం



మోదకొండమ్మ తల్లి ఆలయం

మునగపాక: మోదకొండమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాక బైపాస్ దరి భక్తుల విరాళాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. మునగపాకకు చెందిన మత్స్యకార కుటుంబ సభ్యులంతా తమవంతు సాయంగా విరాళాలు అందజేస్తూ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.

మంగవరంలో సప్తాహం



సప్తాహం నిర్వహిస్తున్న భజన బృందం

పాయకరావుపేట: మహా శివరాత్రి సందర్భంగా మంగవరం గ్రామంలో సప్తాహం నిర్వహిస్తున్నట్లు వీరాంజనేయ సప్తాహ కమిటీ తెలిపింది. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు నిరాటకంగా భజన బృందాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తాయని పేర్కొంది. పాయకరావుపేట, నక్కపల్లి, తుని, కోటనందూరు, ఎస్.రాయవరం మండలాలకు చెందిన భజన బృందాలు పాల్గొన్నాయి.

రామాలయం నిర్మాణానికి రూ.20 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాత చందు

మునగపాక: స్థానిక దళితవాడలో రామాలయం నిర్మాణానికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా నాగులాపల్లికి చెందిన కాండ్రేగుల చందు రూ.20 వేల విరాళం అందజేశారు. వచ్చే నెల 15న ఆలయ ప్రారంభోత్సవానికి తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డొక్కా నాగభూషణం, పిల్లి అప్పారావు, రాజాన బుజ్జి, కోరుకొండ ఈశ్వరరావు, బీలా అప్పలనాయుడు, దిమ్మల నూకరాజు, బీలా లక్ష్మణరావు, మార్లపల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

19 వరకు బ్రూసెల్లా టీకాలు

చీడికాడ : మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలో చీడికాడ, మాడుగుల, మండలాల్లో బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం జరుగుతుందని పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. ఖండివరంలో నిర్వహిస్తున్న బ్రూసెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు.

కాలువ గట్ల ఆక్రమణ



భూమి కాలువపై నిర్మిస్తున్న షెడ్లు



సాగునీటి కాలువపై అక్రమంగా చెట్లు నరికివేసిన దృశ్యం



పాయకరావుపేట: మండలంలో సాగునీటి కాలువ గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దాంతో ఇవి కుచించుకుపోవడంతో సాగునీరు సరఫరాకు ప్రశ్నార్థకంగా మారింది. తాండవ నది ద్వారా సరఫరా జరిగే సాగునీరు ఆధారంగానే మండలంలోని పలు గ్రామాల్లో పొలాల్లో పంటలు పండుతున్నాయి. తాండవ నదిపై నిర్మించిన భూమి, ముతా ఆనకట్టల ద్వారా మండలంలోని పొలాలకు సాగునీరు సరఫరా అవుతోంది. భూమి ఆనకట్ట ద్వారా పాయకరావుపేట, అరట్లకోట, పీఎల్ పురం, సీతారాంపురం, గుంటపల్లి, ఉద్దండపురం తదితర గ్రామాల్లో మూడు వేల ఎకరాలకు, ముతా కాలువ ద్వారా పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం, రాజవరం తదితర పది గ్రామాల్లో ఆరు వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది.

ఆక్రమించి లేఅవుట్లు..

కాలువలు గట్లు ఆక్రమించి లేఅవుట్లు వేయడం, ఇళ్లు, భవనాలు నిర్మించుకుంటున్నారు. దాంతో కాలువ గట్లు బలహీన పడి కుచించుకుపోతున్నాయి. దీని వల్ల సాగునీటి సరఫరా ప్రవహించడానికి ఆటంకం కలుగుతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. భూమి కాలువకు అనుసంధానంగా ఉన్న నేరెళ్ల కాలువ ఆక్రమణలకు గురైంది. ముతా కాలువకు సంబంధించిన అనుబంధ కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న లేఅవుట్లు వల్ల కాలువ గట్లపై చెట్లు తొలగించి ఆక్రమిస్తున్నారు. దాంతో మండలంలోని రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి కాలువల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

ఈ విషయమై నీటి పారుదల శాఖ శ్రీరామమూర్తిని సంప్రదించగా, భూమి కాలువ గట్టుపై నిర్మిస్తున్న షెడ్లను తొలగించాలని ఆదేశించామన్నారు. పెదరాంభద్రపురం గ్రామం వద్ద ముతా కాలువ అనుబంధ కాలువపై తాడి చెట్లు నరికివేయడం, కాలువ గట్టు తొలగించడంపై రైతులకు నోటీసులు జారీ చేశామన్నారు. సాగునీటి కాలువ ఆక్రమణలు, షెడ్లు నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఆక్రమణలకు గురవుతున్న నేరెళ్ల కాలువ

శివాలయాలకు పవిత్ర జలం పంపిణీ



పవిత్ర జలం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పాయకరావుపేట: మహా కుంభమేళా ప్రారంభం రోజున మహా యోగులు స్నానమాచరించగా, సేకరించిన త్రివేణి సంగమం పవిత్ర జలం మహా శివరాత్రికి పరమశివునికి అభిషేకం చేయుటకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వితరణ సభ్యుడు నీలాపు వెంకటరెడ్డి సంకల్పించారు. ఈ మేరకు 150 శివాలయాలకు పవిత్ర జలం పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. పాయకరావుపేట 20, కోటవురట్ల, నాతవరం, నక్కపల్లి, ఎస్.రాయవరంలో 15 శివాలయాలకు చొప్పున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కట్టా వీరబాబు, పల్లెల జోగారావు, పరమేశ్వరరావు, సూర్యారావు, రాఘవ, కొడమటి చినబాబు, భజన గురువు అడపా భాస్కరరావు మాస్టారు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ పరీక్ష



కొరుప్రోలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: పదో తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ ఆకాంక్షించారు. మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రజ్ఞ వికాస మోడల్ పరీక్ష నిర్వహించారు. కొరుప్రోలు పాఠశాలలో జరిగిన ఈ పరీక్షకు 500 వందల మంది హాజరయ్యారు. ఇటువంటి టెస్టులు రాయడం వల్ల పబ్లిక్ పరీక్షలపై భయం పోయి, మానసిక ఒత్తిడి లేకుండా రాస్తే మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శిరీషా, అశ్విని, ప్రసాద్, కృష్ణ, నూకరాజు, సురేష్, సిద్ధూ పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీపీవో శిరీషారాణి

మునగపాక: గ్రామాల్లో వివాదాలకు అవకాశం లేకుండా సోదరభావంతో మెలగాలని డీపీవో శిరీషారాణి కోరారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు కక్షిదారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా వ్యవహరించాలని, తద్వారా ప్రశాంతంగా ఉండవచ్చన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్ఐ పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఇంటర్ హాల్ టికెట్ల పంపిణీ



విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఎస్.రాయవరం: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకమని ప్రిన్సిపాల్ సకురు సత్యనారాయణ తెలిపారు. కొరుప్రోలు నూతనంగా ఏర్పాటైన జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఆయన హాల్ టికెట్లు అందజేశారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ నుంచి 56 విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించే దిశగా బోధించినట్లు చెప్పారు. లెక్చరర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు సహకరించండి



సంపద కేంద్రాల ఉపయోగం వివరిస్తున్న ఈవోపీఆర్డీ రఘురాం

కోటవురట్ల: స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బి.కె.పల్లిలో జరిగిన కార్యక్రమంలో తడి-పొడి చెత్తలను వేర్వేరుగా కార్మికులకు ఇవ్వడం, వీధుల పరిశుభ్రత, తడి చెత్తతో తయారు చేసే సేంద్రియ ఎరువు ఉపయోగాలను వివరించారు. ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని, తద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రఘురాం, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరేడ్‌కు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు



డీఈవో నుంచి మెమెంటో తీసుకుంటున్న విద్యార్థులు

నక్కపల్లి: మండలంలో ఉద్దండపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం అనకాపల్లిలో జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ పరేడ్‌లో పాల్గొనేందుకు తరలి వెళ్లారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ జయంతి సందర్భంగా అనకాపల్లిలో ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్దండపురం విద్యార్థులు 53 మంది పాల్గొన్నారు. మండలంలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక పాఠశాల ఉద్దండపురం హైస్కూలు అని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. వీరి ప్రతిభను గుర్తించి డీఈవో అప్పారావునాయుడు జ్ఞాపికలు అందజేశారన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు రూ.75 వంతున రుసుం చెల్లించాలన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. అదే నెల 27న మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్టు ప్రకటిస్తామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అదే నెల 30న ఉంటుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



నాలుగురోడ్ల జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్: కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి ఏమాత్రం ఉపయోగంలేదని, దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె లోకనాథం కోరారు. గతంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం నాయకులు శనివారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ పథకంలో రూ.60 వేల కోట్లు బడ్జెట్‌లో కోత విధించారని, విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి బడ్జెట్ తగ్గించారని ఆరోపించారు. కార్పొరేట్లకు ప్రయోజనం కలిగే విధంగా బడ్జెట్లో అనేక రాయితీలు కల్పించారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు బ్యాంకులకు బకాయిలు ఉన్న రూ.10 వేల కోట్ల రుణాలను మాఫీ చేశారని, తిరిగి వారికి అప్పులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శులు బి. వెంకటరమణ, జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శంకరరావు, గంటా శ్రీరామ్, సుభాషిణి పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ



కె.జె.పురం జంక్షన్‌లో నిత్యాన్నదాన సత్రం వద్ద భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ధర్మశ్రీ

మాడుగుల రూరల్ : అన్నిదానాల కన్న అన్నదానం మహాదానం అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో సంతోషమాత నిత్యాన్నదాన సత్రంను ఆయన శనివారం సందర్శించారు. అక్కడ భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, సహకరిస్తున్న దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో భీశెట్టి రాజు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయాలి



మాట్లాడుతున్న వియ్యపు రాజు

అనకాపల్లి: గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను తక్షణమే వాయిదా వేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏఐవైఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రోస్టర్ పాయింట్లను సవరించిన తర్వాతే గ్రూప్-2 మెయిన్ పరీక్ష నిర్వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడం కోసం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. రోస్టర్ పద్ధతి కాకుండా ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



ప్లాస్టిక్ డబ్బాలు అందించిన పంచాయతీ సిబ్బంది



మునగపాకలో పర్యవేక్షిస్తున్న సర్పంచ్ అప్పారావు, ఈవోపీఆర్డీ సోమరాజు

పాయకరావుపేట: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈవోపీఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శని, ఆదివారాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో రోడ్డు పక్కన చెత్త కుప్పలు, పశువుల పెంటలు తొలగింపు, సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. శనివారం శ్రీరాంపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేసుకోవడానికి ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి వైవీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం మునగపాకలో పారిశుధ్య పనులను ఈవోపీఆర్డీ సోమరాజుతో కలిసి పర్యవేక్షించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో దోమల సమస్య లేకుండా దోమల మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ

పరిశుభ్రతతో ఆరోగ్యం

అచ్యుతాపురం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం కాపాడుకోవచ్చునని ఈవోపీఆర్డీ శ్రీరామమూర్తి నాయుడు తెలిపారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం శనివారం మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ఆయన ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు వహిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుణాత్మకమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎంఈవో -2 నూకరాజు

నక్కపల్లి: జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా నాలుగో రోజు శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన వివిధ ప్రదర్శనలను ఎంఈవో -2 వేమగిరి నూకరాజు తిలకించారు. అనంతరం సామూహిక చర్చపై వివిధ ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్యలో పి-1, పి-2 వ్యవస్థలపై వారి భాగస్వామ్యంపై వివరించారు. విద్యా విధానంలో చేపడుతున్న సంస్కరణలు, విద్యా వ్యవస్థ బలోపేతానికి, గుణాత్మకమైన విద్యను అందించడానికి శిక్షణ తరగతుల్లో చర్చించి అవగాహన కల్పించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ కె. లలిత, సత్యవతి, మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రిసోర్స్ పర్సన్లుగా ప్రసాద్, జయరాజ్, గణేష్ వ్యవహరించారు.

కురసాలను కలిసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కన్నబాబును సత్కరిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, ఎంపీపీ గోవింద్ తదితరులు

మునగపాక: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన కురసాల కన్నబాబును యలమంచిలి నియోజకవర్గ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా సత్కరించాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద సారథ్యంలో పార్టీ శ్రేణులు కాకినాడలోని కన్నబాబు నివాసానికి మర్యాద పూర్వకంగా వెళ్లి పూలమాలలు, శాలువాలతో సన్మానించాయి. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా కన్నబాబు చెప్పారన్నారు. సూపర్ సిక్స్ అమలు కోసం పార్టీ ఇచ్చే ప్రతీ పిలుపును విజయవంతం చేయాలని సూచించినట్లు ప్రసాద్, గోవింద్ తెలిపారు.

సీపీఎం నాయకురాలు పార్వతమ్మకు ఘన నివాళి



పార్వతమ్మకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్: సీపీఎం సీనియర్ నాయకురాలు కర్రి పార్వతమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. కూండ్రపు సోమునాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆమె మహిళలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సారాకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాలు నడిపారన్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టిన కడదాకా ప్రజల కోసం అహర్నిశలు పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో కర్రి అప్పారావు, శరగడం రామసదాశివరావు, రొంగలి రాము, శరగడం రామునాయుడు, ఆర్.లక్ష్మి, చాపల తాతయ్య, సత్తిబాబు, నాయుడు, కదారి, కాసులమ్మ, త్రిమూర్తులమ్మ పాల్గొన్నారు.

దత్తత గ్రామాల అభివృద్ధికి కృషి



అధ్యాపక సిబ్బందితో సమావేశమైన రీజనల్ కో-ఆర్డినేటర్ పావని

కశింకోట: స్థానిక రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల పరిధిలో ఎంపిక చేసిన దత్తత గ్రామాల్లో సర్వే నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమా శంకర్ తెలిపారు. కశింకోట, బయ్యవరం, జమాదులపాలెం, తేగాడ, పిసినికాడ గ్రామాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి అక్కడ కావలసిన అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. రీజనల్ కో-ఆర్డినేటర్ బి. పావని ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో ఈ విషయమై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దత్తత గ్రామాల్లో బయ్యవరం, పిసినికాడ గ్రామ సచివాలయాలను సందర్శించారు. కళాశాల అసోసియేట్ ప్రిన్సిపాల్ కె. శివ, విభాగాధిపతులు రమణకుమార్, గణేష్, ఆఫీసు సూపరింటెండెంట్ కె. శివరాం పాల్గొన్నారు.